లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పింఛను దారులందరూ తమ లైఫ్ సర్టిఫికేట్‌లను ఈనెల 28వతేదీ లోపు సమర్పించాలని ఖజానాశాఖ ఉప సంచాలకులు, రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్, ఖజానా శాఖ, ఇబ్రహీం పట్నం, విజయవాడ వారి సర్క్యులర్ మెమో మేరకు పింఛను దారులందరూ తమ లైఫ్ సర్టిఫికేట్‌లను ఈనెల 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఉప ఖజానా అధికారికి నేరుగా గాని, లేక 'జీవన్ ప్రమాన్' పోర్టల్ ద్వారా గాని ఆదాయపు పన్నువివరాలను తగిన ఆధారాలతో సంబంధిత ఉప ఖాజానా అధికారులకు అందజేయ వలసినదిగా కోరారు. సమస్యలు ఉంటే ఉప ఖజానా అధికారిని, జిల్లా ఖజానా అధికారిని గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

మామిడి పూత.. డౌటే..?

- దిక్కుతోచని స్థితిలో రైతులు - అకాల వర్షాలతో అవస్థలు

మామిడి తోటలో మందులు పిచికారి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటైన మామిడి ఈసారి పూత డౌటేనని రైతులు అంటున్నారు. ఎన్నడూ లేని విధంగా గత మూడు సంవత్సరాలుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో ఆశాజనకంగా పంట దిగుబడి లేకుండా పోతుంది. ఈసారి వచ్చే ఆదాయం మామిడి చెట్లకు పిచ్చికారి చేసే క్రిమిసంహారక మందులకే సరిపోతుందని, దీంతో అప్పులు తప్పవని దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు.

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ఎక్కువ భాగం రైతు కుటుంబాలే. ప్రధాన వాణిజ్య పంటలైన చెరకు, మామిడి పైనే ఎక్కువ మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత సంవత్సరం ప్రభుత్వం నల్లబెల్లంపై ఆంక్షలు పెట్టడంతో 75శాతం మంది రైతులు బెల్లం తయారుచేయడం నిలిపేశారు. ఇక మరో పంట అయిన మామిడి పంట సాగుపై రైతుల దష్టి మళ్లింది. ఈ మండలంలో సుమారుగా మామిడి పంట సుమారుగా 1600 హెక్టార్లలో ఉంది. డిసెంబర్ నెలలో మామిడి పంట సంరక్షణకు మందులు పిసికారి సమయం ఆసన్నమైంది. అయితే ఈ సంవత్సరం డిసెంబర్ నెలలో సమద్ధిగా వర్షాలు పడటంతో మామిడిచెట్లకు వచ్చిన పూత కూడా వానకు మగ్గిపోయింది. ప్రస్తుతం పంటలో కూడా పూత అంతంత మాత్రంగానే ఉంది. మామిడి పూత వచ్చినప్పుడు కాపాడుకునేందుకు రైతులు పంటకు క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తున్నారు. కొంతమంది రైతులకు ప్రస్తుతం జనవరిలో సంక్రాంతి పండుగ ఉండటంతో కుటుంబ ఖర్చులు అధికమయ్యాయి. దీన్ని దష్టిలో పెట్టుకొని వ్యవసాయ మందుల వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చుకుంటున్నారు. మరి కొంతమంది మామిడి కాయల మండి వ్యాపారస్తుల దగ్గర ఈక్రిమిసంహారక మందులు అప్పులు చేసి తెచ్చుకుంటూ పంటకు పిచికారి చేస్తున్నారు. ఇంత చేసినా పూత అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ మందులకు చేసిన అప్పులు తీరుతాయో లేదో అన్న భయంలో రైతులు కుటుంబ లో వారు ఉంటున్నారు.

పూత రాకుండా ఉన్న మామిడి చెట్లు

పెట్టుబడి అయినా వస్తుందో రాదో తెలీదు

- పందికుంట సుబ్రహ్మణ్యం రెడ్డి, మామిడి రైతు అగ్గిచేనుపల్లె

గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం వానలు డిసెంబర్ నెలలో పడ్డాయి. వానకు వచ్చిన పంట పూర్తిగా మగ్గిపోయింది. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా మామిడి పూత నిలుస్తుందో లేదో తెలీదు. ఈ ఏడాది కనీసం పెట్టిన పెట్టుబడి అయినా వస్తుందో లేదో తెలీని స్థితిలో ఉన్నాం. పెట్టుబడి కూడా రాకుంటే అప్పులు తప్పవు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

సిఐటియు ఆలిండియా 17వ మహాసభలను జయప్రదం చేయండి

జీవో నెంబర్ 1ని తక్షణం రద్దు చేయాలి

చిత్తూరు సిఐటియు కార్యాలయం ఎదుట జెండా ఎగుర వేస్తున్న జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు చిత్తూరు జిల్లాలో సిఐటియు జెండాలు అనేక చోట్ల వేశారని సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తెలిపారు. చిత్తూరు నగరం శేషాపిరాన్ వీధిలోని సిఐటియు కార్యాలయం ఎదుట సిఐటియు జెండాను ఎగురవేశారు. చైతన్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడానికి కార్మికులు సన్నద్ధం కావాలన్నారు. ప్రజల హక్కులను హరిస్తున్న జీవో నెంబర్ 1 కార్మికులు కర్షకులు ప్రజలందరూ వ్యతిరేకించి ఆ జీవన రద్దు పరచే విధంగా ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్ర మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో చలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందని కార్మికులందరూ కలసి ఈదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష, లోకయ్య, లక్ష్మణ్, డప్పు కళాకారుల సంఘం నాయకులు రాజశేఖర్ శంముగం, ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో..

గుడిపాల మండల కేంద్రంలో, రైతు భరోసాకేంద్రం వద్ద సిఐటియు జెండాను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచీవరం సురేంద్ర జెండాను ఎగరవేశారు. 17వ మహాసభలు బెంగళూరులో జరుగుతున్నదని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని కోరారు. లక్ష్మి, మునెమ్మ, లక్ష్మీదేవి, రాజమ్మ, అశోకమ్మ, సౌమ్య పాల్గొన్నారు


యాదమరిలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

యాదమరి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 1ని తక్షణం రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్షురాలు షకీలా యాదమరి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం షకీలా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేసే లక్ష్యంతో తీసుకొచ్చిన జీవో నెంబర్ 1ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈనెల 18 నుండి 22 వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు దేవరాజులు, చంద్ర, పరదేశి పాల్గొన్నారు.

నగరి: సీఐటీయూ 17వ జాతీయ మహాసభలు బెంగళూరులో ఈనెల18 నుంచి 22 వరకు జరుగుతున్న సందర్భంగా నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడలో జెండా ఎగరవేశారు. సిఐటియు నగరి మండల కార్యదర్శి. ఏఎస్. పెరుమాళ్, శన్ముగం, జగదీష్, కందన్, గణపతి, సందీప్, నారాయణస్వామి, పీటర్ పాల్గొన్నారు.

నగరిలో..

పలమనేరు: జనవరి 18 నుండి 22వ తేదీ వరకు బెంగళూరు జరిగే సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షకార్యదర్శులు గిరిధర్ గుప్తా, సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జెండాను ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీఓ-1ను నిరసిస్తూ ఆ ప్రతులను దగ్ధం చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, భవన నిర్మాణ కార్మికులు రాజా, జయంతి, లక్ష్మయ్య, హైదర్ బాషా పాల్గొన్నారు.

పలమనేరులో జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

వికోటలో ఐద్వా ఆధ్వర్యంలో..

వికోట: ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-1 ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని జిల్లా ఐద్వా కన్వీనర్ భువనేశ్వరి పేర్కొన్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈనెల 18 నుండి 22 వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా మహిళ కన్వీనర్ భువనేశ్వరి పిలుపునిచ్చారు. మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి అనిత, శ్యామల, జీవిత పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీకి

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల ప్రజాపంపిణీ ఫిర్యాదుల స్వీకరణ కొరకు 10 మంది ఎగ్జిక్యూటీవ్‌లతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ప్రారంభించియున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నేటి నుంచి పనిచేస్తోందని, సమస్యలను అర్థం చేసుకోవడానికి, సంబంధిత అధికారులకు పంపుటకు, పిర్యాదు చేసిన వ్యక్తికి తగు సమాచారం ఇవ్వడానికి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌లో ప్రజా పంపిణి వ్యవస్థ, ధాన్యము కొనుగోలు, లీగల్ మెట్రాలజీ, వినియోగదారుని రక్షణకు సంబంధించిన ఏదైనా సమస్యను స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ఫిర్యాదుల కొరకు కాల్‌సెంటర్‌ను సంప్రదించి మీసమస్యను నమోదు చేసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీనంబర్: 1967 అని జెసి ప్రకటనలో తెలిపారు.

ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మొదటి బహుమతి సాధించిన విద్యార్థినులు

ప్రజాశక్తి- కుప్పం: తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో జరిగిన జాతీయ లీడ్ ఛాంపియన్షిప్ 2022-23లో ప్రజ్ఞ ఇనోవేటివ్ స్కూల్ విద్యార్థినులు మొదటి బహుమతితో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ శశికళ, చైర్మన్ డాక్టర్ రూప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ లీడ్ పాఠశాలలకు సంబంధించి నేషనల్ లీడ్ ఛాంపియన్షిప్ కాంపిటేషన్ ఆదివారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో జరిగిందన్నారు. ఈ పోటీలకు సుమారు 2వేల పాఠశాలకు గాను 80వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన మరో 2000 మందిని ఎంపిక చేసి హైదరాబాదులో జరిగిన పోటీలలో పాల్గొన్నారని, ఇందులో కుప్పం ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ విద్యార్థినులు కోడింగ్ సంబంధించి వరల్డ్ కరెన్సీ యాప్‌ను సష్టించి పేపర్ పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. ఇందుకుగాను కుప్పం ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ విద్యార్థులకు మొదటి బహుమతి వచ్చిందన్నారు. మొదటి బహుమతి సాధించిన విద్యార్థినుకు లినోవో ల్యాబ్‌టాప్, క్యాష్ ప్రైస్, ట్రోఫీలు దక్కాయని తెలిపారు. మొదటి బహుమతి సాధించిన నవ్య, హిమవర్ష, కోడింగ్ ఉపాధ్యాయులు మణిలను పాఠశాల హెడ్మాస్టర్ పురుషోత్తమాచారి అభినందించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో లీడ్ ఛాంపియన్షిప్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మొదటి బహుమతి సాధించిన ఇద్దరు విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, అభినందనలతో ముంచెత్తారు.

షూటింగ్ బాల్ లీగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం మండల కేంద్రం సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో శాప్ లీగ్ అండర్- 18 షూటింగ్ బాల్ చిత్తూరు జిల్లా జట్టు ఎంపికను మంగళవారం నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ మురళీకష్ణ, చీఫ్ కోచ్ బాలాజీ, కళ్యాణ్ ఫౌండేషన్ అధినేత పవన్ కళ్యాణ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 14వ తేదీన విజయవాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న లీగ్ పోటీలలో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. సెలక్షన్స్ కమిటీగా పిడి వెంకటరమణారెడ్డి, మురళి, జాబీర్‌లు ఉన్నారు.

352 శ్మశాన స్థలాల భూసేకరణ వేగవంతం

జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో శ్మశానాల ఏర్పాటుకు ప్రధానంగా భావిస్తోందని అసైన్‌మెంట్ భూములను పరిశీలించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని 22ఎలో ఉన్న భూములకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని, రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ ఎన్.రాజశేఖర్‌తో కలసి మండల రెవెన్యూ అధికారులు, ఆర్‌డిఒలతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన శ్మశానస్థలాలను వెంటనే అప్పగించే చూడాలన్నారు. అదేవిధంగా అసైన్‌మెంట్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సబంధించి వివరాలు నమోదుచేసి పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులకు సబంధించి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణ వేగవంతం చేయాలని నోటిఫికేషన్ విడుదల చేసేలా వెంటనే చూడాలన్నారు. మొదటి దశ రీసర్వే కార్యక్రమంలో ఇంకా ఏమైనా భూహక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉంటే సంక్రాంతి లోపున పంపిణీ చేయాలన్నారు. మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నవి పరిష్కరించాలన్నారు. డ్రోన్‌సర్వేకు సంబంధించి ఇప్పటి వరకు 766గ్రామాల్లో పూర్తి అయిందని మిగతా కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఖాతా కరెక్షన్ కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. 134 గ్రామాలకు సంబంధించి మొదటిదశలో ఫైనల్ రికార్డులు మరో 16 గ్రామాలకు సంభందించి పంపాలని అన్నారు. రెండవ విడత రీసర్వే కార్యక్రమంలో మరో 10గ్రామాలలో ప్రభుత్వ భూములను గుర్తించడం జరిగిందన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం వేగవంతంగా చేయాలని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్‌డిసి పర్వీన్ కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ రాజశేఖర్

ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటికే ప్రభుత్వ సేవలను అందించేందుకు సచివాలయ వ్యవస్థను అమలు చేయడం జరుగుతున్నదని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సదుం మండలంలో రెండవ రోజు మంగళవారం పల్లె బాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. బూరగమంద గ్రామ పంచాయతీ సీతన్నగారి పల్లిలో రూ.40లక్షలతో సచివాలయం, మొరవపల్లిలో రూ.8.5లక్షలతో అంగన్వాడీ కేంద్రం, బూరగమందలో రూ.17.50లక్షలతో డాక్టర వై.యస్.ఆర్ హెల్త్ క్లినిక్, రూ.8.5లక్షలతో అంగన్వాడీ కేంద్రం, దేవదారు మాకులపల్లిలో రూ.8.5 లక్షలతో అంగన్వాడీ కేంద్రం ప్రారంభించడంతోపాటు కొత్తవడ్డిపల్లిలో 18మంది రైతులకు అనుభవ పత్రాలను అందించారు. అదేవిధంగా జోగివారిపల్లిలో రూ.21.80 లక్షలతో ఆర్‌బికే భవనాన్ని నడిగడ్డలో రూ.17.50 లక్షలతో డాక్టర్ వై.యస్.ఆర్ హెల్త్ క్లినిక్ మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ గ్రామస్థాయి లోని ప్రజలకు సేవలు అందించేలా సచివాలయ వ్యవస్థతో పాటు రైతులకు అవసరమైన అధునాతన సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయ సాగు పద్దతులపై అవగాహన కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ వై.యస్.ఆర్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించడం జరిగిందన్నారు. గర్భవతులకు అవసరమైన పౌష్టికాహారంను అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ కిట్లు ద్వారా అందజేస్తున్నామని, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులతో పాటు గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఇలా ఒక గ్రామంలో సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ నిర్మాణం ద్వారా ప్రజలు పొందే సేవలతో ఆ గ్రామం ముఖచిత్రం మారడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం ద్వారా పొందే సేవలను పెంపొందించేందుకు కషి చేయడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్‌పిసిఈఓ ప్రభాకర్ రెడ్డి, డిపిఓ లక్ష్మి, ఐసిడిఎస్ పిడి నాగ శైలజ, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ వరప్రసాద్, పంచాయతీ రాజ్ డీఈ చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై కొరడా..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనధికార లేఅవుట్లపై నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా జులిపించారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని తిమ్మసముద్రం, చవటపల్లి రెవెన్యూ పరిధిలో అనధికార లేఅవుట్లపై దాడులు నిర్వహించి అనధికారికంగా లేఅవుట్లు వేసిన యజమానులకు నోటీసులు జారీ చేశారు. చూడా అనుమతి లేకుండా అనధికారికంగా లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్‌ప్లానింగ్ అధికారి మురళీకష్ణ హెచ్చరించారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఔట్లను తొలగించారు. నగరపాలిక అనుమతి లేకుండా ప్లాట్లను కొనుగోలు చేయొద్దని సూచించారు. స్థానిక వైసీపీ నాయకుడు రాజకీయ పలుకుబడితో తిమ్మసముద్రం, చౌటపల్లి రెవెన్యూ పరిధిలో అనధికారికంగా లేఅవుట్లను వేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

అనధికార లేఅవుట్లను తొలగిస్తున్న నగరపాలక టౌన్ ప్లానింగ్ సిబ్బంది

నేడు నాలుగో విడత జగనన్న తోడు నిధులు విడుదల

జిల్లాలో 31,649 మందికి లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 11న బుధవారం 4వ విడత జగనన్న తోడు పథకాన్ని ఉదయం 11 గంటలకు తాడేపల్లె నుండి వర్చువల్ విధానంలో కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, లబ్ధిదారులు పాల్గొంటారని తెలిపారు. వీధి విక్రయదారులు, కాయగూరల విక్రయదారులు, తదితర చిరువ్యాపారులు రుణాల కొరకు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం ద్వారా రూ.10వేలు వడ్డీలేని రుణాలను లబ్ధిదారులకు అందించడం జరుగుతున్నదన్నారు. ఈరుణాలను క్రమం తప్పకుండా బ్యాంకులకు తిరిగి చెల్లించిన వారికి అందుకు సంబంధించిన పూర్తి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 4వ విడత జగనన్న తోడు పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని 21,866 మంది లబ్ధిదారులకు రూ.59,897,00, పట్టణ ప్రాంతాలలోని 9,783 మంది లబ్ధిదారులకు రూ.24,90,721 మొత్తం 31,649మొత్తం లబ్ధిదారులకు రూ.84,80,447లు లబ్ధి చేకూరనున్నదని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

జల్లికట్టు, కోడి పందేలు, జూదంపై పోలీస్ నిఘా

30 పోలీసు యాక్టు అమలు చేయండి

అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనంతపురం రేంజ్ పరిధిలో ఎక్కడా కూడా జల్లికట్టు, కోడి పందేలు, జూదం వంటివి జరుగకుండా నిఘావేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని డిఐజి ఎం.రవి ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. కోడి పందేలు, జల్లికట్టు, జూద క్రీడలు నిర్వహించడం నిషేధమని, ఎవరైనా వీటి జోలికెళ్లినా, ఆడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకుని భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని రేంజ్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని సిఐలు, ఎస్సైలు గ్రామపెద్దలుతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరుగకుండా ఉండేలా సమాయత్తం చేయాలన్నారు. సంబంధిత డిఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ పక్కాగా కొనసాగించాలన్నారు. కోడి పందేలు, జల్లికట్టు ఆటలు జరిగే వీలున్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో కోడి పందేలు, జల్లికట్టులపై కేసులున్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. జల్లికట్టు, కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. రేంజ్ పరిధిలోని అన్ని సబ్‌డివిజన్ల పరిధుల్లో '30 పోలీస్ యాక్టు' అమలులో ఉంటుందన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యక్రమాల జోలికెళ్లకుండా ఇంటిల్లిపాది సంక్రాంతి పండుగను సుఖ,సంతోషాలుతో జరుపుకోవాలన్నారు. అనంతపురం రేంజ్ పరిధిలో ఏ ప్రాంతంలోనైనా జల్లికట్టు, కోడిపందేలు, జూదం జరుగుతున్నా జరిగే వీలున్నా వెంటనే డయల్- 100కు ఫోన్ చేయాలని డిఐజి విజ్ఞప్తి చేశారు. సత్వరమే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జెడ్‌పి సీఈఓ

ప్రజాశక్తి- సోమల : సదుం మండలం చెరుకువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన గురించి తెలుసుకున్నారు. అలాగే మనబడి, నాడు- నేడు పథకం క్రింద చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేసి భవనాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సమావేశం నిర్వహించి రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల రికవరీ మెరుగుపడాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు తక్కువ వడ్డీతో ఇస్తున్న శ్రీనిధి రుణాలను రికవరీ మెరుగుపడాలని ఏపీఎం ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఐకెపి కార్యాలయంలో ఏపీఎం ఫరీదమస్తాన్ సమీక్షలో శ్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలకు, సంఘమిత్రలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం ప్రకాష్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఉద్దేశంతో ప్రభుత్వం తక్కువవడ్డీతో శ్రీనిధి రుణాలను అందిస్తుందని తెలిపారు. శ్రీనిధి తీసుకున్న మహిళలు కంతుల ప్రకారం సక్రమంగా చెల్లిస్తే వారికి ఇంకను ఎక్కువ శ్రీనిధి రుణాలు ఇస్తారని, ఐవేకక బ్యాంకులో తీసుకున్న రుణాలను కంతులు ప్రకారం సక్రమంగా కట్టుకుంటే ఒక మహిళలకు లక్షయాభై వేలు రుణాలు ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందు ఎదగాలని సూచించారు. మేనేజర్ లావణ్య, సిసి చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, మంజుల, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దాతలు శ్రీపురం సీతారామయ్య, మంజునాథ్‌ల సహకారంతో మంగళవారం స్థానిక ఎన్జీఓహోంలో కందిపప్పు, గోధుమపిండి, శెనగలు, రాగిపిండి, నూనె, తదితర పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారం అందజేయడం వల్ల రోగులు శీఘ్రంగా కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, పిపిఎస్ కార్యదర్శి నరసింహులు, వైద్యశాఖ సిబ్బంది రమేష్ బాబు, జగదీశ్వరి, పిపిఎస్ సభ్యులు విజయ కుమార్‌రెడ్డి, దేవా, దొరస్వామి, నారాయణ, దవనముని, పొన్ముడి, శేగు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి - పాలసముద్రం: తడి, పొడి చెత్తలను సక్రమంగా ఉపయోగించుకుని ఎరువు తయారు చేయడంపై గ్రీన్ అంబాదచర్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విస్తరణ అధికారి రమేష్ సూచించారు. మంగళవారం శ్రీకావేరాజపురం పంచాయతీలో ఎంఈఓ సర్పంచ్ గాలి మహేష్ బాబుతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. రమేష్ మాట్లాడుతూ తమ పరిసరాల ప్రాంతాల్లో ఉన్న చెత్తలను ఉపయోగించి ఎరువు తయారు చేసి వాటిని మనం సాగు చేసుకునే పంటకు వేస్తే అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. రసాయన ఎరువులు వాడడం వల్ల రైతులకు నష్టాలు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో చెత్త కుండీలలో ఉన్న తడి, పొడిచెత్తను ప్రతిరోజు తీసేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, వాలంటీర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

కుప్పం: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నాడు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జింకా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి మన సంస్కతి సాంప్రదాయాలకు గుర్తుగా జరుపుకునే అతిపెద్ద పండుగ అన్నారు. రైతులు కొత్తగా పండించిన పంటలు ప్రతిఫలం ఇంటికి వచ్చిన ఆనందంతో చిరకాలం సంతోషంగా గడపాలని చేసుకొనే పండుగే సంక్రాంతి అని తెలుపుతూ పండగ విశిష్టతను గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ముగ్గుల పోటీలు, సంక్రాంతి పిండి వంటల పోటీలతో పాటు చివరి వేడుక రోజున పోటీల కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.రామ సుబ్బారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ పొదిలి నాగరాజు, మాధవి, రాజ్యలక్ష్మి, శైలజ, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

'క్యాన్సర్' నివారణపై అవగాహన



ప్రజాశక్తి- యాదమరి: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమేనని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ప్రజలకు సూచించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుడితి రెడ్డిపల్లి గ్రామంలో క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిహెచ్ఓ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రారంభదశలో లక్షణాలు కనిపించకుండా ఉండవచ్చు అన్నారు. మహిళల్లో రుతుక్రమంలో మార్పులు, గర్భాశయంలో జరిగే సహజ మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం బుడితి రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న టీబీ వ్యాధిగ్రస్తున్ని సందర్శించి మాత్రలు వాడుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి విష్ణుప్రియ, ఏఎన్‌ఎం విమల, ఆశా శ్రీమతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమ పథకాలు ప్రభుత్వం రద్దు

నగరి టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - నగరి: దళితుల 7 వేల కోట్ల నిధులను వైసిపి సర్కార్ దారి మళ్లించిందని, దళితుల 27 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ విమర్శించారు. మంగళవారం నగరి రూరల్ మండలం తెరణి, మూలనత్తం పంచాయతీలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దళితుల ఆర్థికాభివద్ధికి ఖర్చు పెట్టాల్సిన ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ. 7వేల కోట్లు దారిమళ్లించి తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వంకు బుద్ధి చెప్పాలని కోరారు. అంబేద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తూ దళితుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన డబ్బులు దారి మళ్లించి ద్రోహం చేస్తున్నారు. దళితులకు అన్నీ విధాలుగా నష్టం చేస్తూ, అన్యాయం చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపి తెలుగుదేశంను గెలిపించి ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ నిధులు, 27 పథకాలను తిరిగి అనుభవించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శివకుమార్ రెడ్డి, ప్రధానకార్యదర్శి పురుషోత్తం, రాష్ట్ర టిఎన్ టియుసి సెక్రటరీ బాలాజీ, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, శ్రీనివాసులురెడ్డి, బాలసురేష్, గుణశేఖర్, కనకరాజ్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని దిశ డిఎస్పీ ఆర్.రామరాజు తెలిపారు. కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, దిశ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా ఎస్ఐ గిరిజా మాట్లాడుతూ దిశ చట్టం మహిళలకు మాత్రమే కాదని, దానిని పురుషులు సైతం వినియోగించవచ్చని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా నేరమని, చట్టపరమైన శిక్షలు ఉంటాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి విద్యార్థుల చేత ర్యాగింగ్ రహిత కళాశాలగా సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు డాక్టర్ సిఎన్.లత, కార్తీక్, స్వామి శివయ్య, మణిగండన్, నర్మద, జేకెసి మెంటర్ లోకేశ్వర్, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలోనే ప్రథమస్థానంలో 'పరమహంస యోగానంద' విద్యార్థి

ప్రజాశక్తి- శాంతిపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వీర గాథ 3-5 తరగతుల విభాగంలో పరమహంస యోగానంద విద్యాలయంలో 4వ తరగతి చదువుతున్న వై.యశ్విక గీచిన చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ వీర గాథ చిత్రంగా ఎంపికైందని సీబీఎస్ఈ న్యూఢిల్లీ వారు విద్యాలయానికి సమాచారం అందించారు. ఈ అవార్డును ఈనెల 26వ తేదీన న్యూఢిల్లీలో జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొని, అవార్డు స్వీకరించడానికి సీబీఎస్ఈ న్యూఢిల్లీ వారు ఆహ్వానం పంపారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజాద్ హుస్సేన్ తెలియజేశారు. ఈపోటీలో దేశవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు ఎన్నిక కాగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్క విద్యార్థిని మాత్రమే ఉండడం గొప్ప విషయమని అభినందించారు. విద్యాలయ జాయింట్ కరస్పాండెంట్ రాధాకష్ణ, చైర్మన్ గోపాల్ అగర్వాల్, ఉపాధ్యాయురాలు విద్యార్థిని అభినందించారు.

వాగ్దానాన్ని నిలబెట్టుకొన్న ప్రభుత్వం వైసీపీనే..!

ప్రజాశక్తి- శాంతిపురం: అన్ని సామాజికవర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కషిచేస్తున్నారని వారి సంక్షేమమే ఆయన ధ్యేయమని ఎమ్మెల్సీ కెఆర్జె భరత్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకున్నామని ఆయన పాత్రికేయులకు తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని సొన్నేగానిపల్లి పంచాయతీలోని నాయనపల్లి గ్రామంలో రెండవరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీకు ఆ గ్రామప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీకి ఆ పంచాయతీ ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్సీ ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందుతున్నాయా లేదా అని వాకబు చేశారు. పలువురు గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్సీ దష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్సీ అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని వారికి సూచించారు. జడ్పిటిసి ఎస్.శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, మాజీ రెస్కో అధ్యక్షులు జే.చక్రపాణిరెడ్డి, బుల్లెట్ దండపాణి, నాగభూషణమ్మ సుబ్బరాజు, కష్ణమూర్తి, విశాలాక్షి సుకుమార్, నాగమ్మ చంగప్ప, సర్పంచ్ పుష్పావతి మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు డాక్టర్ విజయ కుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైద్యవిధాన పరిషత్ సామాజిక ఆరోగ కేంద్రంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారి విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, వారంలో రెండు రోజులు బుధ, గురువారం డాక్టర ఎస్‌బి.ప్రవీణ్ కుమార్ (గైనకాలజిస్ట్), గురు, శుక్రవారం రోజులలో డాక్టర ఎస్ఎన్.భరత్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని గర్భవతులకు చిన్నపిల్లలకు ప్రత్యేక చికిత్స ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మండలంలోని గర్భవతులకు స్కానింగ్ సేవలు అందుబాటులో ఉందని, మండల ప్రజలు వైద్యసేవలను వినియోగించుకోవాలని, నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో డాక్టర్ కె.పయాజ్ అహమ్మద్ నియమితులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌నర్స్ మునిరా భాను, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర పంటలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంల పరిధిలోని గౌనితిమ్మేపల్లిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారి మునికృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు నాగార్జున పొలంలో గణజీవామృతం తయారు చేసి దాని వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులందరూ రసాయన ఎరువులను వీడి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. దీని వలన ఆరోగ్యంతో పాటు అధిక దిగుబడులు సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంటి విజయ కుమారి, పలమనేరు మండల ఎంటి రాజమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రధానమంత్రి సురక్ష మాత అభయ పథకం గర్భిణీ స్త్రీలకు వరమని దీనిని సద్వినియోగ పరుచుకోవాలని ఆరి మాకులపల్లి ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ గౌరీ అన్నారు. మంగళవారం ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ పథకం ద్వారా మండలంలో గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్ష నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవడం కలిగే లాభాలు, సుఖ ప్రసవం కోసం వ్యాయామాలు వివరించారు. పౌష్టికాహారం పరిసరాలలో లభించే ఆకుకూరలు తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పల్లవి నెలవాయి సచివాలయ గ్రామ పరిధిలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన గడపగడపకు ప్రజావైద్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 104 డాక్టర్ గౌస్, యమునా వాణి, మంజుల, యాక్సెసీనా సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- పులిచెర్ల: ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయకుండా ప్రభుత్వ నియమాల ప్రకారం నడుచుకోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్‌ఇన్స్పెక్టర్ గుంటూరు రామకష్ణ శాస్త్రి తెలిపారు. మంగళవారం సిబ్బందితో కలిసి పులిచెర్ల మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్, డిపో ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ల ప్రకారం స్టాకు ఉంచుకున్నట్లయితే ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీలుండదని, ప్రతిఒక్క సూపర్వైజర్ రోజు బ్యాంకు సమయంలో ఉదయం 11 గంటలలోగా చలానా రూపంలో ప్రభుత్వానికి ముందు రోజు నగదు జమచేయాలని తెలిపారు. బ్రాండ్ల ప్రకారం స్టాకుపెట్టుకోని సిబ్బందిపై, 11 గంటల లోగా చలానా చెల్లించని వారిని గుర్తించి సిఐ దష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈతనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సోమలలో ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని బజారు వీధిలో కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. విప్రో కంపెనీ డిస్ట్రిబ్యూషన్ వారు ఈ ముగ్గుల పోటీలను నిర్వహించగా అధికసంఖ్యలో మహిళలు పాల్గొని వీధులలో రంగురంగుల ముగ్గులను వేశారు. ముగ్గుల పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

విజయం విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

చిత్తూరు అర్బన్: విజయం విద్యాసంస్థల్లో మంగళవారం ఘనంగా సంక్రాతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులను విజయం విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజ మూర్తి, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అభినందించారు.

పుత్తూరులో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. కళాశాల ప్రధానాచార్యులు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు వెలిగించి అధ్యాపకులు, విద్యార్థులు నృత్యాలు చేశారు. వీరయ్య, కందేరి శ్రీదేవి, నర్సింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత పక్షానే తెలుగు యువత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కొత్త సంవత్సరంలో తేదీ మారినట్టుగానే జాబ్ క్యాలెండర్ ను విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులతో ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, యువత పక్షాన తెలుగు యువత అండగా ఉండి పోరాడుతుందని తెలుగు యువత రాష్ట్ర నాయకులు రవినాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉరితాడు ప్రదర్శిస్తూ యువత పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ని నిర్వహిస్తానని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తానని చెప్పి యువతను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు కష్ణ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు కరణం సందీప్, వెంకటేష్ రెడ్డి, వంశీ, సుభాష్, సంతోష్ రాయల్, లోకేష్, రఫీ, శివ, నాగరాజు పాల్గొన్నారు.

నేర సమాచారం

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి పంచాయతీ పరిధిలో మంగళవారం పొలాల వద్ద ఉన్న వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి శవమై తేలాడు. దీనిని గమనించిన పశువుల కాపరులు మండల పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు వృద్ధుడు, తెల్లని రంగు గల వస్త్రాలు ధరించి ఉన్నాడని, అతనిని ఇంతకు ముందు ఈపరిసర ప్రాంతలలో చూడలేదని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పలమనేరు పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

అనారోగ్యంతో కుటుంబ యజమాని మృతి

ప్రజాశక్తి- రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామపంచాయతీ చిన్నమసీదువీధికి చెందిన టైలర్ ఇ.హజారుద్దీన్ (40) అనారోగ్య సమస్యల వల్ల మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రొంపిచెర్ల జడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాష, మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ యజమాని మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి కుటుంబానికి న్యాయం చేస్తామని జెడ్పిటిసి హామీ ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు మహారాష్ట్ర లాతూర్ నందు జరిగిన 16 రాష్ట్రాలు జాతీయ రాకెట్‌బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనగా విజేతగా ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో రాకెట్‌బాల్ జట్టు సభ్యులు ఎన్.హేమాద్రి రెడ్డి, ఎన్.వెంకటేష్, కె.రాజా, జి.కుమార్, పురుషోత్తంరాజు, గజేంద్రరాజును టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి పి.మోహన్ మురళి ఘన సన్మానించారు. మోహన మురళి మాట్లాడుతూ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలబెట్టినందుకు అభినందించారు. రాష్ట్రంలోని వెదురుకుప్పంకు గుర్తింపు తీసుకువచ్చిన క్రీడాకారులను కోచ్ నాగభూషణంను సత్కరించారు. కార్యక్రమంలో కిరణ్ యాదవ్, కమలాకర్ రెడ్డి, రవి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో సందడే సందడి

కార్వేటినగరం: సంక్రాంతి సంబరాలతో జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) సందడే సందడిగా ఏర్పడి పండుగ వాతవరణాన్ని తలపించింది. మంగళవారం సంక్రాంతిని పురస్కరించుకుని ముందస్తుగా సంభరాలను వైభవంగా జరుపుకున్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం పురుషోత్తం, ఇన్చార్జి ప్రిన్సిపాల్ చెంగల్రాజు, అధ్యాపకులు ప్రభాకర్, నిర్మల, దేవప్రసాద్, మహమ్మద్ రఫీ, శ్రీనివాసులురెడ్డి, నగరాజు నాయక్, రెడ్డి వెంకటరమణ, అనిత, ఆదర్శ పాఠశాల హెచ్ఎం గాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ ఖర్మను తొలగించుకోవాల్సిందే..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ బాగుపడాలంటే వైసీపీ ఖర్మను తొలగించుకోవాల్సిందేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 34వ వార్డులో మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొజ్జల సుధీర్ రెడ్డితో పాటు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు నరసింహ యాదవ్ హాజరయ్యారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందనీ, అభివద్ధి అటకెక్కిందని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. దశరథ ఆచారి, రెడ్డివారి గురువారెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పాకాల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 51/2021

కె. గోపాల్ ... వాది

కె. రాజన్న తండ్రి రామకృష్ణయ్య
ఆర్. కురవపల్లె (గ్రామం), మతుకువారిపల్లె (పోస్టు),
పులిచెర్ల మండలం, చిత్తూరు జిల్లా.
... ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

ప్రతివాదికి ఇందుమూలముగా తెలియజేయడమ ఏమనగా, వాది మీపై దావా వేసియున్నారు. పై కేసు నందు మీ యొక్క హాజరుకు గాను వాయిదా 27-01-2023న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు హాజరు కలదు. మీరు హాజరు కాని పక్షమున తీర్పు మీ మీద వ్యతిరేకముగా రాబడును అని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఎస్.ఎన్.యం. సలీమ్
న్యాయవాది, పాకాల
సెల్: 9441075055.